# నిమ్స్‌లో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఎక్విప్‌మెంట్

- ఖరీదైన పరికరాలతో మెరుగైన సేవలు
- అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవంలో డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిమ్స్‌లో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఎక్విప్‌మెంట్‌ను సమకూర్చామని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని దవాఖానలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. గతంలో శస్త్రచికిత్సలకు అవసరమైన సీ-ఆర్మ్ యంత్రాలు ఒకటి రెండు మాత్రమే ఉండేవని, దీంతో సర్జరీల కోసం రోగులు నిరీక్షించాల్సి వచ్చేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నిమ్స్‌లోని ప్రతి విభాగానికి ఒక సీ-ఆర్మ్ యంత్రం, న్యూరో సర్జరీ విభాగంలో 3డీ-సీ-ఆర్మ్ యంత్రం అందుబాటులో ఉన్నట్టు వివరించారు. ఫలితంగా సర్జరీలు త్వరితగతిన జరగడమే కాకుండా ఎక్కువ మందికి శస్త్రచికిత్సలు చేయగలుగుతున్నట్టు తెలిపారు. రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌లో రెండు సిటీ స్కాన్ యంత్రా లు, రెండు ఎంఆర్ఐ యంత్రాలు, మమోగ్రఫీ, బోన్ డెన్సిటీ, ఎక్స్‌రే, మొబైల్ ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. త్వరలోనే కొత్త డీఎస్‌ఏ యంత్రం కూడా అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుకపూర్, డీన్ డాక్టర్ లిజారాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతవీర్, రేడియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ జ్యోత్స్న, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ లక్ష్మీభాస్కర్, నిమ్స్ పీఆర్వో సత్యాగౌడ్, హాస్పిటల్ అనుసంధాన కర్త డాక్టర్ మార్త రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రేడియాలజీ దినోత్సవం సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న నిమ్స్ సిబ్బంది

# టెన్త్ మెమోలపై పర్మినెంట్ నంబర్

- హాల్‌టికెట్లు, టీసీలపై కూడా ముద్రణ
- అనుమతి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యార్థులందరికీ పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్)ను అమలు చేయనున్నారు. టీఎస్‌పీఎస్సీ వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్), ఆధార్ తరహాలో ఈ నంబర్‌ను కేటాయిస్తారు. అయితే, ఈ ఏడాది పదోతరగతి విద్యార్థుల మెమోలు, హాల్‌టికెట్లు, టీసీలపై ఈ పెన్ నంబర్‌ను ముద్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అనుమతినిచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం మెమో జారీ చేశారు. సమగ్రశిక్ష అధికారుల ప్రతిపాదనలకు అంగీకరించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నది. ఇప్పటి వరకు పదోతరగతి మెమోలపై కేవలం హాల్‌టికెట్ నంబర్‌ను పలు సెక్యూరిటీ ఫీచర్లతోముద్రిస్తున్నారు. దీంతో సర్టిఫికెట్లు అసలో.. నకిలీవో గుర్తించడానికి అధికారుల పరిశీలన తర్వాత తెలిసేది. కానిప్పుడు పెన్ నంబర్ ఆధారంగా సులభంగా దొరకపట్టవచ్చు.

### లాభాలివే..

- పెన్ నంబర్ అమలుచేయడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ అని తేడాల్లేకుండా దీన్నిఅన్ని యాజమాన్యాల్లో అమలు చేస్తారు.
- విద్యార్థి ఎక్కడ చదువుతున్నారో?.. ఏ స్థాయిలో ఉన్నారో ఇట్టే తెలుసుకోవచ్చు. డ్రాపౌట్స్‌ను అరికట్టవచ్చు. తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించవచ్చు.
- ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ యూనిక్ ఐడీ తరహాలో నంబర్‌ను కేటాయిస్తారు.
- యూడైస్ పోర్టల్‌లో నమోదైన విద్యార్థుల వివరాల ఆధారంగానే పెన్ నెంబర్‌ను కేటాయిస్తారు.



## లోకం పోకడ

## మరో 3 రోజులు వర్షాలు

- కొనసాగుతున్న అల్పపీడనం
- పలు జిల్లాల్లో దంచికొట్టిన వర్షం

హైదరాబాద్, నవంబర్ 8(నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నదని, దీంతో దక్షిణాదిన పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, అండమాన్ నికోబార్ దీవుల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో 3 గంటలపాటు వర్షం దంచికొట్టింది. అత్యధికంగా భద్రాద్రి జిల్లా మద్దుకూరులో 10 సెం.మీ., యాదాద్రిలోని నారాయణపూర్‌లో 7.6 సెం.మీ, శేరిలింగంపల్లిలో 4 సెం.మీ. నమోదైంది. వచ్చే మూడు రోజులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలతోపాటు వరంగల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ తెలిపింది.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 34.5°c | 19.0°c |
| ఆదిలాబాద్ | 34.5°c | 17.7°c |
| రంగారెడ్డి | 33.0°c | 20.4°c |
| నిజామాబాద్ | 32.5°c | 22.9°c |
| మెదక్ | 32.2°c | 21.2°c |
| ఖమ్మం | 32.0°c | 21.0°c |
| మహబూబ్‌నగర్ | 31.2°c | 24.5°c |
| హైదరాబాద్ | 30.0°c | 22.7°c |
| కరీంనగర్ | 30.0°c | 22.0°c |
| వరంగల్ | 29.0°c | 23.0°c |

## క్వెస్ట్‌నెట్ కేసులో కామాక్షి అరెస్టు

**15 ఏండ్లుగా పరారీలో నిందితురాలు**

**తమిళనాడులో అరెస్టు చేసిన సీఐడీ**

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): క్వెస్ట్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (గోల్డ్ కాయిన్) కేసులో 15 ఏండ్లుగా తప్పించుకు తిరుగుతున్న కామాక్షి రంగనాథ్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు చెన్నైలో అరెస్టు చేశారు. మనీ సర్క్యులేషన్ స్కీమ్ ద్వారా మల్టీలెవల్ మార్కెటింగ్‌కు తెరలేపి ఎంతోమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు. రూ.32 వేలకే గోల్డ్ కాయిన్ అని, అందుకు రూ.460 రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డబ్బులు దండుకున్నారు. ఈ కేసులో కామాక్షి రంగనాథ్ ఏ5గా ఉన్నారు. వరంగల్‌లో 2008లో నమోదైన ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. నిందితురాలిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న సీఐడీ పోలీసులను ఆ విభాగం ఏడీజీ మహేశ్‌భగవత్ అభినందించారు.

## 'గాంధీ' ఫ్రీజర్లన్నీ పనిచేస్తున్నాయి

**హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం**

**పిల్‌పై విచారణ ముగించిన ధర్మాసనం**

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మృతదేహాలను భద్రపరచే 90 ఫ్రీజర్ బాక్సుల్లో 82 పనిచేస్తున్నాయని, మిగిలిన వాటికి మరమ్మతులు చేయించడంతో అవి కూడా వినియోగంలో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఆ దవాఖానలోని మొత్తం 90 ఫ్రీజర్ బాక్సుల్లో 15 మాత్రమే పనిచేస్తున్నాయంటూ ఓ పత్రికలో వచ్చిన వార్తను సుమోటో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి హైకోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదన వినిపిస్తూ మొత్తం 90 ఫ్రీజర్ బాక్సులు పనిచేస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనానికి తెలిపారు. దీనికి సంతృప్తి చెందిన ధర్మాసనం ఈ పిల్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

## డీఏల విడుదలకు అనుమతి ఇవ్వండి

**ఈసీకి టీఎన్జీవో వినతి**

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): దీపావళి సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్న మూడు పెండింగ్ డీఏలను విడుదల చేయడానికి అనుమతి ఇవ్వాలని టీఎన్జీవో కేంద్ర సంఘం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు విజ్ఞప్తిచేసింది. టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మూజీబ్ హుస్సేనీ, కేంద్ర సంఘ ప్రతినిధి పర్వతాలు బుధవారం బీఆర్‌కే భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు డీఏల కోసం ఎదురు చూస్తున్నారని, విన్నపంపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

## నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తెలిపింది. ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫ్, రిజిస్టర్డ్ నర్సస్ అండ్ మిడ్‌వైఫ్, రిజిస్టర్డ్ లేడీ హెల్త్ విజిటర్స్ కేటగిరీల్లో అవార్డులు అందించనున్నట్టు వెల్లడించింది. ఒక్కో క్యాటగిరీ నుంచి కనీసం ఐదుగురు అభ్యర్థులను ఎంపిక చేసి జాబితా పంపాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ నాటికి జాబితాను పంపాలని, మే 12న అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపింది.

## ఇంజినీరింగ్ కాలేజీలకు మూడేండ్లకోసారి అనుమతులు

- ఏఐసీటీఈ పరిధిలోకి బీబీఏ, బీసీఏ కోర్సులు
- డ్రాఫ్ట్ అప్రూవల్ హ్యాండ్‌బుక్ విడుదల

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ కాలేజీలకు ఇక నుంచి మూడేండ్లకొకసారి అనుమతులు ఇవ్వనున్నారు. 2024-27 విద్యా సంవత్సరానికి అనుమతులిచ్చేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) బుధవారం డ్రాఫ్ట్ అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్ విడుదల చేసింది. దీనిప్రకారం.. బీబీఏ, బీసీఏ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ రెండు కోర్సులు నిర్వహించే కాలేజీలు ఏఐసీటీఈ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం వంటి అస్పిరేషనల్ జిల్లాల్లో విద్యావకాశాల పెంపునకు ప్రయత్నించాలని ఏఐసీటీఈ సూచించింది. ఈ డ్రాఫ్ట్ మార్గదర్శకాలపై ఈ నెల 17లోపు సూచనలు సలహాలివ్వాలని తెలిపింది.

**డ్రాఫ్ట్ మార్గదర్శకాలిలా..**

- ఇంజినీరింగ్ సహా వృత్తివిద్యాకాలేజీలు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు కౌన్సెలర్లను నియమించుకోవాలి. మానసిక కౌన్సెలింగ్ సేవలను అందించాలి.
- ఇప్పటికే నడుస్తున్న విద్యాసంస్థలు ఏఐసీటీఈ అనుమతి లేకుండానే అప్లయిడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, వొకేషనల్ కోర్సులు నిర్వహించుకోవచ్చు.
- బీటెక్, డిప్లొమా కోర్సులను తెలుగు సహా ప్రాంతీయ భాషల్లో నిర్వహించుకోవచ్చు. ఇక నుంచి ఏ సబ్జెక్టునైనా మైనర్‌గా బోధించవచ్చు.
- ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్, ట్విన్నింగ్, జాయింట్ డిగ్రీ, డ్యూయల్ డిగ్రీలను నిర్వహించుకోవచ్చు.

## ప్రశాంత్ బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

- కోర్టులో ముగిసిన వాదనలు
- ప్రవీణ్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

నాంపల్లి కోర్టులు, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో 16వ నిందితుడైన సాన ప్రశాంత్‌రెడ్డి అలియాస్ ప్రశాంత్ బెయిల్ పిటిషన్‌పై బుధవారం వాదనలు పూర్తయ్యాయి. ఆయనను 5 రోజుల కస్టడీకి అప్పగించాలన్న సిట్ విన్నపాన్ని 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జీ ఈశ్వరయ్య తిరస్కరించడంతో నిందితుడి బెయిల్ పిటిషన్‌పై ఆయన తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. న్యూజిలాండ్‌లో ఉంటున్న ప్రశాంత్‌రెడ్డి తన కుమార్తె ఆరోగ్యం సరిగా లేకపోవడంతో భారత్‌కు వచ్చాడని, ఈ నేపథ్యంలో ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై సిట్ తరపు న్యాయవాది స్పందిస్తూ.. ప్రశాంత్ వద్ద గ్రూప్-1 ప్రశ్నపత్రం ఉన్నదని, దాన్ని ఇతరులకు అందించేందుకు జరిగిన లావాదేవీలపై విచారణ చేపట్టాల్సి ఉన్నదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న మెజిస్ట్రేట్.. తీర్పును గురువారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. బెయిల్ కోసం ప్రధాన నిందితుడు పులిదిండి ప్రవీణ్‌కుమార్ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

## నేడు లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : లాసెట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 13 తర్వాత ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. దీపావళి తర్వాత రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టాలని భావిస్తున్నారు. గురువారం లాసెట్ ప్రవేశాల కమిటీ సమావేశమై, షెడ్యూల్ విడుదల చేయనున్నది. రాష్ట్రంలో లాసెట్ పరీక్ష మే 25న నిర్వహించగా, జూన్ 12న ఫలితాలు విడుదల చేశారు. మూడేండ్ల లా కోర్సులో 78.59 శాతం, ఐదేండ్ల లా కోర్సు ప్రవేశపరీక్షలో 80.21శాతం, పీజీ లా సెట్‌లో 94.36శాతం అభ్యర్థులు అర్హత సాధించారు.

## కోర్టులకు సోమవారం సెలవు

నాంపల్లి కోర్టులు, నవంబర్ 8 : దీపావళి పర్వదినం ఆదివారం రావడంతో తర్వాతి రోజు సోమవారానికి సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. 13వ తేదీ(సోమవారం)ని కూడా సెలవుదినంగా పరిగణించాలని రాష్ట్రంలోని అన్ని కోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. అన్ని జిల్లా కోర్టులతోపాటు ట్రిబ్యునల్, లేబర్ కోర్టులకు సైతం సెలవు వర్తిస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నది.


